# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 32 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 6 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :32 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 6 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





# ఇంటింటికీ జలధార..

## రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం



పెన్ పవర్ డెస్క్:గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు.
ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు

- మిగతా 2లో



## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ
- ఈ నెల 8న హాజరు కావాలని నోటీసుల్లో వెల్లడి
- వేరే పనులున్నాయని, మరో తేదీ చెబుతానని అంబటి సమాధానం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు.

- మిగతా 2లో



## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ

- మిగతా 2లో

## 2029 నాటికి 4-స్టార్..

### ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!



- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని

- మిగతా 2లో

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

- టికెట్ కోసం రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారని జగన్‌పై తీవ్ర ఆరోపణలు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- పల్లె పండుగ 3.0, జలజీవన్ మిషన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ

- మిగతా 2లో



## నిజం బయటపడ్డది..




### సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై రాహుల్ ఫైర్

పెన్ పవర్ డెస్క్: సర్ ప్రక్రియలో అవకతకవలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష తీరుపై ఆరోపణలకు సంబంధించి కేంద్ర

- మిగతా 2లో



## 'మా అనుమతి లేదు'..

### ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

పెన్ పవర్ డెస్క్:కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు.ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని

- మిగతా 2లో

- ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి



## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:పెరుగుతున్న అత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అత్యాచారం చేసే వారికి శిక్షలు మరింత కఠినంగా ఉండాలని .. రేప్ చేయాలం టేనే భయపడి పోవాలని ఢిల్లీ పోలీసులు కీలక ఆదేశాల జారీ చేసింది. ఢిల్లీ ఎన్ సీఆర్ అత్యాచారం కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

- మిగతా 2లో




## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

పెన్ పవర్ డెస్క్:భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగు తున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

### మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

- వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన
- కార్ల్ డీస్సెరొత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత
- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి

- మిగతా 2లో



## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

### సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

## నిజం బయటపడ్డది..

- మొదటి పేజి తరువాయి

ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇవ్వడంపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేసిన రాహుల్ గాంధీ.. ఫారమ్ 6లో మార్పులకు ఎటువంటి ఆమోదం తెలపలేదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్?పై ఫైర్ అయ్యారు.

'జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారన్నది ఇప్పుడు నిస్సందేహంగా రుజువైంది. బీజేపీకి సహాయం చేయడానికి అతను తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు మాత్రమే. మన ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో పాలుపంచుకున్న జ్ఞానేష్?తో పాటు ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉంటారు" అని రాహుల్ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చిన తర్వాత సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

**ఈసీ, కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు**

సర్ ప్రక్రియలో అవకతకవలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఆయనను పదవి నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. అక్టోబర్ 5న ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘంలో మిగిలిన ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

అంతేకాకుండా, ఫామ్ 6 మార్పులకు తాము ఎటువంటి ఆమోదం తెలపలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫామ్ 6?లో మార్పులు ఎవరు చేశారో రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. దేశంలోవ కోట్ల సంఖ్యలో ఓటర్లను తొలగించారన్న ఆరోపణల వేళ కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేయడం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

నేరం పాల్పడే వారి మనసులో చట్టం పట్ల భయాన్ని కలిగించడం అవసరమని కోర్టు తెలిపింది. నేరం చేస్తే ఏం జరుగుతుందో , వాటి పరిణామాలకుభయపడకపోతే, అటువంటి నేరాలను నివారించడం కష్టమని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది. సమాజంలోని ప్రతి మహిళ మన తల్లి, సోదరి వంటిది. మనం వారికి భద్రతా భావాన్ని కల్పించాలి. మనం ఇంట్లో మహిళల భద్రతను ఎలాగైతే నిర్ధారిస్తామో, సమాజంలో కూడా అలాగే చేయాలి. ఒక మహిళ బస్సులో ఒంటరిగా ప్రయాణిస్తుంటే, పోలీసులకు ఆమె గురించి సమాచారం ఉండాలని, ఆమె భద్రతపై చురుకుగా వ్యవహరించాలని కోర్టు పేర్కొంది. ఈ కేసులో తదుపరి విచారణ నవంబర్ 16కు వాయిదా వేసింది.

**నేరాలపై నిఘాకోసం వార్ రూం..**

నేరాల నియంత్రణకు ఓ వార్ రూం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఢిల్లీపోలీసులను ఆదేశించింది. నేరాలను అరికట్టడంలో ఢిల్లీ పోలీసులు ఏవైనా ప్రత్యేక చర్యలు చేపట్టారా.. వార్ రూం లాంటిది ఏర్పాటు ఏదైనా ఏర్పాటు చేశారా అని పోలీసులను ప్రశ్నించింది. జాతీయ డేటా బేస్ ద్వారా అనుమానిత క్రిమినల్స్, ప్రమేయం ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టాలని అధికారులను కోర్టు కోరింది. మహిళలు, విద్యార్థులనుపదే పదే వేధించే వ్యక్తులు ఉన్నారని, అన్ని ఏజెన్సీలు కలిసి నిఘా ఉంచితే పరిస్థితిని చక్కదిద్ద వచ్చని తెలిపింది. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులకు వార్నింగ్ ఇచ్చింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 2012 నిర్భయ కేసును కూడా ప్రస్తావించింది. అనుమతి లేకుండా నడుస్తున్న హోటళ్లలో మద్యం కూడా అందిస్తున్న ప్రదేశాలపై దృష్టి సారించాలని కోర్టు ఢిల్లీ పోలీసులను కోరింది. 2012 నాటి ఘటనకు సంబంధించిన రికార్డుల ప్రకారం, నిందితురాలు నేరం చేయడానికి ముందు ఓ ప్రదేశంలో భోజనం , మద్యం సేవించినట్లు కోర్టు పేర్కొంది. ఢిల్లీలోని భద్రతా ఏర్పాట్లపై కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. బహిరంగ ప్రదేశాలు, పార్కులలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సొలిసిటర్ జనరల్ ను కోరింది. క్షేత్రస్థాయిలో పోలీస్ నిఘా, జవాబుదారితనం, నియంత్రణ చర్యల అవసరాన్ని ధర్మాసనం నొక్కిచెప్పింది.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

# ఇంటింటికీ జలధార..

- మొదటి పేజి తరువాయి

ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

**రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు**

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

**గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 2029 నాటికి 4-స్టార్..

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్–స్టార్ పాఠశాలలన్నింటినీ టూ–స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో–స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్–స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4–స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5–స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్–స్టార్... 15,618 టూ–స్టార్... 19,099 త్రీ–స్టార్... 7,172 ఫోర్–స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట**

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు.

**అభివృద్ధి, సంక్షేమంలో కూటమి ప్రభుత్వం పరుగులు**

ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి 61.60 లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

**రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ–నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకొని పది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేసిన స్ఫూర్తితో, మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'ను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

**స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట**

తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

### మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరొత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు. ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడాప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు.

ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడాప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ – జలజీవన్ మిషన్'కు 2019–24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'మా అనుమతి లేదు'.. ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

- మొదటి పేజి తరువాయి

సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్–6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్–6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్–6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్–1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్–6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- మొదటి పేజి తరువాయి

వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**కేసు నేపథ్యం ఇదే..**

ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.

# వెలుగొండ ప్రాజెక్ట్ అధికారులతోసమీక్ష

## ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 05**

వెలుగొండ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులపై గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగొండ ప్రాజెక్ట్ ముంపు ప్రాంతాల ప్రజల పునరావాసం, పునరావాస ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, వెలగలపాయ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, వెలుగొండ ప్రాజెక్ట్ ప్యాకేజీ––×ం కింద కొనసాగుతున్న పనుల పురోగతి, పనుల నాణ్యత తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.అలాగే కంబం సమీపంలోని వెలుగొండ గెస్ట్‌హౌస్ నిర్వహణపై కూడా ఎమ్మెల్యే అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు నిర్ణీత ప్రమాణాల ప్రకారం నాణ్యతతో, నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఈఈ శ్రీనివాసులు, డీఈలు, ఏఈలు తదితర ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# ఈ నెల 9న కొండేపి నియోజకవర్గంలో
# సీఎం చంద్రబాబు పర్యటన

## నర్సింగోలులో 8,500 మంది రైతులకు మీ భూమి .. మీ హక్కు' కార్యక్రమంలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 05**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన కొండేపి నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ఒంగోలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ తో కలిసి సోమవారం పరిశీలించారు. కలికివాయి, బిట్రగుంట, నర్సింగోలు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటనకు అనువైన స్థలాలను మంత్రులు, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం నర్సింగోలులోని రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి ఆలయంతో పాటు శనీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి నెల 9వ తేదీన రైతుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ నెల 9వ తేదీన కొండేపి నియోజకవర్గంలోని నర్సింగోలులో సుమారు 8,500 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి కలికివాయి, బిట్రగుంట, నర్సింగోలు ప్రాంతాల్లో మూడు స్థలాలను పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. నర్సింగోలు స్థలానికి



సంబంధించి జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక పంపించనున్నట్లు వెల్లడించారు. మరో రెండు, మూడు రోజుల్లో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పూర్తి కార్యక్రమం ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**రైతులకు భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి డోలా**

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండేపి నియోజకవర్గంలోని నర్సింగోలులో పర్యటించి 8,000 మందికి పైగా రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేయనున్నట్లు తెలిపారు. 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు భూమిపై సంపూర్ణ హక్కు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అందజేయడం ద్వారా భూ హక్కులకు మరింత భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 4,000 ఎకరాల నిషేధిత భూములకు సంబంధించిన గ్రామ కంఠాల క్లియరెన్స్ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నర్సింగోలు గ్రామంలో సుమారు 400 ఎకరాలకు క్లియరెన్స్ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వేల ఎకరాలకు సంబంధించిన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. కలికివాయి, బిట్రగుంట, నర్సింగోలు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం నర్సింగోలులో ముఖ్యమంత్రి పర్యటన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, విజయ్ కుమార్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో
# ఆశీర్వదించండి

**-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు**
**-కందుకూరు మండలంలో పల్లెపండుగ 3.0 పనులకు శంకుస్థాపన**
**- అనంతసాగరం నుంచి ఓవి రోడ్డు - 70 లక్షలు**
**-కొండికందుకూరు నుంచి కొష్టాలు మీదుగా కందుకూరు - 1.97 కోట్లు**
**-బలిజపాలెం నుంచి కమ్మవారిపాలెం - 1.47 కోట్లు**





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 5**

పల్లెపండుగ 3.0, పీ ఎం జి ఎస్ వై కింద 3 రోడ్లను తారురోడ్లుగా మార్చేందుకు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో పల్లెపండుగ 3.0 ద్వారా తారురోడ్ల నిర్మాణానికి 8 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే చెప్పారు. గ్రామాలలో రోడ్లు, తాగునీరు, స్మశానాల అభివృద్ధి తదితర మౌలిక వసతులన్నీ ఏర్పాటు చేయాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని తెలిపారు. కందుకూరు మండలంలోని అన్ని గ్రామాలకు రామతీర్థం నీటిని అందించే పనులు 30 కోట్లతో జరుగుతున్నాయని, ఐదారు నెలల్లో పనులు పూర్తవుతాయని నాగేశ్వర రావు వెల్లడించారు. కొండి కందుకూరు గ్రామంలో 30 లక్షలతో ఇప్పటికే సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు... తల్లికి వందనం పథకం ద్వారా 206 మందికి ప్రతి ఏటా 30 లక్షలు, అన్నదాత సుఖీభవ ద్వారా 260 మంది రైతులకు 52 లక్షలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాజకీయాలు, ఎన్నికలతో సం బంధం లేకుండా అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు చేస్తున్నామని, తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తు పెట్టుకుని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ రాయపాటి సుభాషిని శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ పార్టీల అధ్యక్షులు బైరపునేని రమణయ్య, తోకల రామకృష్ణ, ఈదర నరసయ్య, ఏఎంసి డైరెక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు బైరపునేని కోటయ్య, శ్రీకాంత్, రెబ్బవరపు మాల్యాద్రి, ఏకాంబరం నాగేశ్వరరావు, వెంకట్రావు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు, డిఈ మాలకొండయ్య, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# వాన వాన రావే.. మా కష్టాలు తీర్చవే..!

**- ఎండిపోయిన వేల ఎకరాల పంటలు,అప్పుల్లో కూరుకుపోయిన అన్నదాత**
**- జిల్లాలో సగటు వర్షపాతంలో 40 శాతం లోటు,బోర్లలో అడుగంటిన నీరు**
**- పత్తి, మిర్చి, కంది సాగు పూర్తిగా దెబ్బతిన్న వైనం - చెరువులు వట్టిపోయి పశువులకు తాగునీటి కరువు**
**- వ్యవసాయ కూలీలకు పనులు లేక వలసల భయం - 37 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం**
**- ప్రకటనతో సరిపెట్టకుండా వెంటనే సాయం అందించాలని రైతుల డిమాండ్**





**మార్కాపురం (స్టాఫ్ రిపోర్టర్) పెన్ పవర్ అక్టోబర్ 05**

ఆకాశం వైపు చూస్తూ ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతులు వాన వాన రావే.. మా కష్టాలు తీర్చవే అంటూ వేడుకుంటున్నారు. ఈ ఏడాది నైరుతి వర్షాలు పూర్తిగా విఫలం కావడంతో ఖరీఫ్ సాగు అటకెక్కింది. లక్షల ఎకరాల్లో సాగు కావాల్సిన పంటలు విత్తన దశలోనే ఎండిపోయి రైతులను అప్పుల ఊబిలోకి నెట్టాయి. సాధారణంగా 6 లక్షల ఎకరాల్లో జరగాల్సిన సాగు 2 లక్షల ఎకరాలకు కూడా చేరుకోలేదు. జిల్లాలో సగటు వర్షపాతంలో 40 శాతం లోటు నమోదైంది. బోర్లలో నీటి మట్టం 300 అడుగులకు పడిపోయింది. పత్తి, మిర్చి, కంది పంటలు 60 శాతం మేర తగ్గిపోయాయి.పొలాల్లో పనులు లేక వ్యవసాయ కూలీలు బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాలకు వలస వెళ్తున్నారు. చెరువులు ఎండిపోవడంతో పశువులకు మేత, నీరు కూడా కరువైంది. పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం 37 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా, కేవలం ప్రకటనతో సరిపెట్టకుండా వెంటనే ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమా, ఉపాధి హామీ పనులు పెంచి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**వర్షపాతంలో రికార్డు లోటు..:** జిల్లాలో సాధారణ వర్షపాతం 380 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా ఈ ఏడాది 230 మిల్లీమీటర్లు కూడా దాటలేదు. అంటే దాదాపు 40 శాతం లోటు. మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల, పీసీపల్లి, పామూరు లాంటి పశ్చిమ ప్రాంత మండలాల్లో అయితే 50 శాతానికి పైగా లోటు ఉంది. బోర్లలో నీటి మట్టం 300 అడుగులకు పడిపోయింది.

**ప్రధాన పంటలకు తీవ్ర నష్టం..:** జిల్లాలో ప్రధాన పంట అయిన పత్తి సాగు ఈ ఏడాది 60 శాతం తగ్గిపోయింది. మిర్చి, కంది, వేరుశనగ పంటలు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాయి. విత్తనం వేసిన రైతులు మొలకలు రాక నష్టపోతే, మొలకెత్తిన పంటలు నీరు లేక ఎండిపోయాయి. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతుకు ఇప్పుడు పైసా కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదు.

**పశువులకు మేత కరువు..:** వర్షాలు లేకపోవడంతో పచ్చగడ్డి కరువైంది. చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోవడంతో పశువులకు తాగడానికి నీరు కూడా దొరకడం లేదు. దీంతో చాలా మంది రైతులు తమ పశు వులను సంతల్లో తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. పాడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.

**కూలీల వలసలు..:** పొలం పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీలకు ఉపాధి కరువైంది. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కూడా సరిగ్గా లేకపోవడంతో కుటుంబాలకు కుటుంబాలు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లాంటి నగరాలకు వలస వెళ్తున్నారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**37 మండలాలు కరువు జాబితాలో..:** పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 37 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. మార్కాపురం జిల్లాలో కంభం, రాచర్ల మినహా మిగిలిన 19 మండలాలతో పాటు ప్రకాశం జిల్లాలో 18 మండలాలను ఈ జాబితాలో చేర్చారు.

**ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి..:** కేవలం కరువు ప్రకటనతో సరిపెట్టకుండా వెంటనే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత ఏడాది కరువు ప్రకటించినా పరిహారం అందలేదని, ఈ ఏడాదైనా ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం, రుణాల రీ షెడ్యూల్, ఉపాధి హామీ పనుల పెంపు లాంటి చర్యలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. లేకపోతే రైతులు తీవ్ర ఇబ్బందుల్లో పడతారని రైతు సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

# యాదవుల మహాధర్నాతో దద్దరిల్లిన ఒంగోలు కలెక్టరేట్

**-యాదవులపై కక్షపూరిత వైఖరిని విడనాడాలి**
**-మీ గెలుపులో భాగస్వాములైన యాదవులనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?"**
**-మాజీ కౌన్సిలర్ దాసరి మాల్యాద్రి పై అక్రమంగా పెట్టిన కేసులను రద్దు చేయాలి**
**-గంగమ్మ తల్లి జాతరకు అడ్డంకులు తొలగించాలి**



**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం అక్టోబర్ 5**

సోమవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు యాదవ వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ప్రకాశం జిల్లా యాదవులు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలలనుండి యాదవులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు యాదవుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. యాదవ యువకులు, నాయకులు, కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా అక్రమ కేసులు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కేసులు బనాయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి. అలాగే లింగసముద్రం మండలం అన్నేబోయినపల్లి గ్రామపంచాయతీలో యాదవ కులస్తుల గౌరవానికి సంబంధించిన సంప్రదాయాలు, ఆచారాలలో భాగమైన గంగమ్మ తల్లి జాతరను నిర్వహించకుండా అడ్డుకోవడం పట్ల యాదవ సమాజంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి కులం, ప్రతి వర్గం తమ సంప్రదాయాలను గౌరవంగా కొనసాగించుకునే హక్కు కలిగి ఉంది. ఒక వర్గానికి అనుకూలంగా, మరో వర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో కలగడం కూడా ప్రజాప్రతినిధికి మంచిది కాద అని అన్నారు. ఎమ్మెల్యే మీరు తొలిసారి కందుకూరు ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు మీ విజయానికి యాదవ సోదరులు, సోదరీమణులు కూడా తమ ఓటుతో భాగస్వాముల య్యారు. అదే ప్రజల ఆశీర్వాదంతో మీరు ఈ స్థాయికి వచ్చారు అని అన్నారు.యాదవులపై కక్షపూరిత వైఖరి ఉంటే వెంటనే విడనాడాలి, అక్రమ కేసుల పేరుతో ఎవరినీ భయభ్రాంతులకు గురిచేయ కూడదు అని అన్నారు. అన్నేబోయి నపల్లి గంగమ్మ తల్లి జాతర నిర్వహణకు అడ్డంకులు తొలగించాలి. అన్ని కులాలు, అన్ని వర్గాలను సమానంగా గౌరవించాలి అని అన్నారు.ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధి ప్రజలందరికీ సమానంగా ఉండాలి. ఒక వర్గాన్ని దూరం చేసి, మరో వర్గానికి ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలకు తావివ్వకూడదు అని అన్నారు.ఇదే విధంగా యాదవ సమాజంపై కక్షపూరిత చర్యలు కొనసాగితే, రాబోయే రోజుల్లో యాదవ సోదరులు, సోదరీమణులు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేస్తారు. 2029 ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెప్పే పరిస్థితి రావచ్చు అని అన్నారు. ఈ మహా ధర్నా కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసుకొని యాదవుల మీద జరుగుతున్న దాడులపై , శ్రీ శ్రీగంగమ్మ తల్లి,ఆచార వ్యవహారాలలో జోక్యం చేసుకున్నటువంటి వారిపై స్థానిక కలెక్టరేట్లో వినతి పత్రం సమర్పించారు, అక్రమ కేసుల మీద కూడా, జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు.



# ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన సీఐ



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 5**

కందుకూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్‌గా ఎస్.జగదీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని మర్యాద పూర్వకంగా కలిశారు. కందుకూరు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని సిఐకు ఎమ్మెల్యే సూచించారు.

# కందుకూరు సర్కిల్ నూతన సీఐగా జగదీష్ బాధ్యతలు



**కందుకూరు, పెన్ పవర్ అక్టోబర్ 5**

కందుకూరు సర్కిల్ కార్యాలయ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. జగదీష్ బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన సర్కిల్ కార్యాలయంలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సీఐ ఎస్. జగదీష్ మాట్లాడుతూ ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారికి మరింత చేరువైన పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ అందిస్తామని సీఐ జగదీష్ తెలిపారు.

# సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు 'సేవా సేతు అభియాన్'

**అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో కందుకూరులో ప్రత్యేక క్యాంపు**



**కందుకూరు, పెన్ పవర్ అక్టోబర్ 5:**

ప్రజల సౌకర్యార్థం ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా గృహాలపై సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు 'సేవా సేతు అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కందుకూరు టౌన్ ఆపరేషన్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ.ఎం. రాఘవేంద్రరావు తెలిపారు.కందుకూరు టౌన్ సబ్ డివిజన్ పరిధిలోని కందుకూరు టౌన్, కందుకూరు రూరల్, పొన్నలూరు సెక్షన్ల గృహ విద్యుత్ వినియోగదారుల కోసం అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.క్యాంపులో పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అధీకృత వెండర్ ఎంపిక, బ్యాంకు రుణం పొందేందుకు అవసరమైన ప్రక్రియ, ఇతర ఆన్‌లైన్, దరఖాస్తు ప్రక్రియలను ఒకే చోట పూర్తి చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కందుకూరు టౌన్, కందుకూరు రూరల్, పొన్నలూరు సెక్షన్ల పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లపై సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు.

క్యాంపు వేదిక: కందుకూరు టౌన్ సెక్షన్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగం తేదీలు: అక్టోబర్ 6, 7, 8

కార్యక్రమం: సేవా సేతు అభియాన్.

# జీవీబీ కుమార్ అక్రమ నిర్బంధాన్ని ఖండించాలి

**-సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్**

**కందుకూరు, పెన్ పవర్ అక్టోబర్ 5**

రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు జి.వి.బి. కుమార్‌ను పోలీసులు అక్రమంగా హౌస్ అరెస్టు చేసి, అనంతరం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ తీవ్రంగా ఖండించారు.సోమవారం ఉదయం 6 గంటలకే కందుకూరు పట్టణంలో జి.వి.బి. కుమార్‌ను హౌస్ అరెస్టు చేసి, మధ్యాహ్నం 3 గంటల వరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం ప్రజాస్వామిక హక్కులను హరించడమేనని ఆయన విమర్శించారు. అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ప్రజల సంపదను కార్పొరేట్లకు అప్పగించే విధానాలను వ్యతిరేకిస్తూ సిఐటియు నిరంతరం పోరాడుతుందని తెలిపారు. రామాయపట్నం పోర్టుతో పాటు ఇండోసోల్, బీపీసీఎల్ సంస్థలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో సంస్థలు కొనసాగితే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న నాయకులు, కార్యకర్తల పట్ల పోలీసులు ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించాలని ఎం. రమేష్ కోరారు. ఉద్యమాలను అణచివేసే చర్యలకు పాల్పడకుండా ప్రజాస్వామిక హక్కులను గౌరవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కూరాకు వానిపల్లె మండల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ 2 శ్రీనివాసుల రెడ్డి

**రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేసి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చిన ఎంఈఓ 2**

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 5**

కొమరోలు మండలం చింతలపల్లి పంచాయతీలోని కూరాకువాని పల్లెలో గల మండల ప్రాథమిక పాఠశాలను సోమవారం కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 టి శ్రీనివాసులు రెడ్డి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆయన పాఠశాల లో గల ఉపాధ్యాయులు,విద్యార్థుల హాజరు పట్టిలతో పాటు అన్ని రకాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డికి సహోపాధ్యాయులు కిరణ్ కు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలని,డ్రాప్ అవుట్సు లేకుండా చూసుకోవాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులు కూడా నిర్ణీత సమయానికి పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు గట్టి పునాదులతో బంగారు బాటలు వేయాలని ఆయన కోరారు.పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసి కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్, సభ్యులతోపాటు తల్లిదండ్రుల సలహాలు సూచనలు పాటిస్తూ వారి సహాయ సహకారాలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎంసి ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి వంట నిర్వాహకులకు తమ సూచనలు సలహాలు ఇచ్చారు. ఆ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి మధ్యాహ్న భోజనం చేశారు. ఆ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సహోపాధ్యాయుడు కిరణ్, సి ఆర్ పి రామాంజి తదితరులు పాల్గొన్నారు.





# చలో మార్కాపురం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి -ఊసా వెంకటేశ్వర్లు



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 5**

మార్కాపురం అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల వ 7 తేదీన నిర్వహించే చలో మార్కాపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం పార్టీ మార్కాపురం జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో సోమవారం కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఉద్యమాలు, పోరాటాలు వలన ఏర్పడిన మార్కాపురం జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధి తొ తగినన్ని నిధులు కేటాయించి అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ ఈ నెల 7 వ తేదీ మధ్యాహ్నం మార్కాపురంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మూడు దశాబ్దాలుగా చేసిన పోరాట ఫలితంగా వెలిగొండ మొదటి దశ పూర్తి అయిందని సాగు, త్రాగునీరు అందించాటానికి చర్యలు తీసుకోవాలని, నిర్వాసితుల అర్హులైన వారందరికీ వెంటనే నష్టపరిహారం అందించాలని. వెలిగొండ ప్రాజెక్ట్ కు రెండవ దశకు నిధులు కేటాయించి ప్రాజెక్టు పూర్తి చేసి అన్ని ప్రాంతాల ప్రజలకు న్యాయం చేయాలని, అలాగే పీసీ పల్లి మండలం, మోపాడు రిజర్వాయర్ ను ప్రాజెక్ట్ పరిధిలో కి చేర్చాలని ఈ ప్రాంతం నుంచి సాగుతున్న వలసలను నివారించాలంటే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని, నియోజకవర్గం లో ప్రతిపాదించిన నిమ్జ్, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని పండ్ల తోటల రైతుల కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, గ్రానైట్, తెల్ల రాళ్ల గనులు ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలని గిరిజన తండాలు , మైదాన గిరిజనులైన ఎస్టీల నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రంలో అన్ని శాఖలకు అధికారులను, సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించి సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, మెడికల్ కాలేజీని వెంటనే పూర్తి చేసి పేద ప్రజలకు వైద్యం అందుబాటులోకి తేవాలని, ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని, పలకల పరిశ్రమను ఆదుకోవాలని, మార్కాపురంలో మిర్చి యార్డు ఏర్పాటు చేయాలని, అన్ని ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి అనుసంధానం చేస్తూ రోడ్లు అభివృద్ధి చేసి రవాణా సౌకర్యం మెరుగుపరచాలని, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ లకు నిధులు కేటాయించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, జిల్లాలో అన్ని మండలాల్లో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి స్మశాన స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే బహిరంగ సభలో ప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం ద్వారా ఈ జిల్లాను అభివృద్ధి చేసుకుందామని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎస్ తిరుపతి రెడ్డి, మారం రెడ్డి రత్నారెడ్డి, బిజే రత్నం, బక్కా యేసురత్నం, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరిను సత్కరించిన 17వ వార్డు నాయకులు



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 5**

కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలోకందుకూరులోని 17వ వార్డుకు చెందిన వివిధ సామాజిక వర్గాల నాయకులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో సోమవారం కలిశారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలన్న పట్టుదలతో కృషిచేసి విజయం సాధించారని ఎమ్మెల్యే కి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీకి పాలకమండలి ఏర్పాటయితే, మరిన్ని నిధులు వచ్చేందుకు వీలుందన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వారు తెలియజేశారు. వార్డు అధ్యక్షుడు కొత్త నరేంద్ర, అన్న క్యాంటీన్ డైరక్టర్ కాకుమాని ప్రవీణ్, నాయకులు ఇమ్మడిశెట్టి సుబ్బారాయుడు, మురారిశెట్టి సుబ్బారావు, కంకణాల వెంకటేశ్వర్లు, అరటిపాముల శరభయ్య, అవ్వారు ముసలయ్య, ఆకురాతి శ్రీనివాసరావు, తోట సురేష్, పసుపులేటి లక్ష్మణ్, గంటా శివ, జాదవ్ అజయ్, నాగిశెట్టి సురేష్, తేలప్రోలు సాయి కిరణ్, తోట పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో సమస్యలు పరిష్కారం

## ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 05**

గిద్దలూరు పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక " కార్యక్రమాన్ని నిర్వహించారు, కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ , పట్టణ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే కు నేరుగా విన్నవించుకున్నారు . అందులో కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించగా, మిగిలిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దూర ప్రాంతాల వారిని ఉద్దేశించి వారి వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి పేద ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించేందుకు కట్టుబడి ఉన్నారని "ప్రజల వద్దకే పాలన" అనే ఉద్దేశంతో నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, కూటమి నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొనీ అర్జీలు అందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

**- గ్రీవెన్స్ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం డీ.ఆర్.వో.**



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 05**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత కాలవ్యవధిలో పారదర్శకంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.వి. రమణ ఆదేశించారు. ?సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వయంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 303 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ మాట్లాడుతూ, సోమవారం గ్రీవెన్స్ కు వచ్చే అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా మాత్రమే శాశ్వతంగా పరిష్కరించగలమని పేర్కొన్నారు. అర్జీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా చట్టపరిధిలో నాణ్యమైన పరిష్కారం లభించేలా చూసే బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ?ఒకసారి సమర్పించిన అర్జీలు మళ్లీ మళ్లీ అదే సమస్యపై రాకుండా చూడాలని, మొదటిసారే సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్జీదారులకు స్పష్టమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని ఉద్ఘాటించారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా అర్జీలు పెండింగ్‌లో పడకూడదని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి జిల్లా అధికారులు తగిన మార్గదర్శకత్వం చేస్తూ, అర్జీల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా విపత్తు నిర్వహణ అధికారి మాధురి, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి అనుపమ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతిలతో పాటు పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గిద్దలూరులో రెస్టారెంట్‌లో కుళ్ళిన చికెన్, మటన్

**పాచిపోయిన అన్నం.. కుళ్లిపోయిన చికెన్‌పై ఫిర్యాదు**



**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 05**

పట్టణ శివారులో వీఆర్ గ్రాండ్ రెస్టారెంట్‌లో పాచిపోయిన అన్నం, వాసన వస్తున్న చికెన్ వడ్డించారంటూ వినియోగదారుల ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే. గిద్దలూరు మండలం పొదలకుంటపల్లి గ్రామానికి చెందినమహేశ్వర రావు తన బంధువులతో కలిసి వీఆర్ గ్రాండ్ రెస్టారెంట్‌కు మధ్యాహ్నం భోజనం చేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా తమకు పాచిపోయిన అన్నం, దుర్వాసన వేదజల్లుతున చికెన్ వడ్డించారని మహేష్ ఆరోపించారు. చికెన్‌ను నోట్లో పెట్టుకోగానే దుర్వాసన రావడంతో రెస్టారెంట్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదని తెలిపారు. దీంతో ఈ విషయంపై గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మహేష్ తెలిపారు.మహేశ్వర రావు ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి రెస్టారెంట్‌కు చేరుకుని పరిశీలించారు. అక్కడ చికెన్ నుంచి వాసన వస్తున్న విషయం తమ పరిశీలనలో గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఫిర్యాదును స్వీకరించామని, ఈ వ్యవహారంపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**రెస్టారెంట్లపై తనిఖీలు చేయాలి !!**

ఈ ఘటన నేపథ్యంలో గిద్దలూరు పట్టణంలోని ఇతర రెస్టారెంట్లు, హోటళ్లలోనూ ఆహార నాణ్యత, పరిశుభ్రత, నిల్వ చేసే విధానం తదితర అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షణ పెంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 6, 7, 8 తేదీల్లో "సేవా సేతు అభియాన్" క్యాంపులు

## రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రజలకు అవగాహన -రూ.78 వేల వరకు సబ్సిడీ

## - ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు వెల్లడి






**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 05**

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో "సేవా సేతు అభియాన్" క్యాంపులను నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ప్రకాశం జిల్లా ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాకినేని హరిబాబు తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల డిస్కమ్‌ల పరిధిలో "సేవా సేతు అభియాన్" క్యాంపులను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని, అందులో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో ఈ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రతి ఇంటికి సౌర విద్యుత్ ను చేరువ చేయడం, రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించడమే సేవా సేతు అభియాన్ ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఇంటి పైకప్పు పై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా అర్హత కలిగిన గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. రూ.78 వేల వరకు సబ్సిడీ.

**పథకం కింద అర్హత కలిగిన గృహ వినియోగదారులకు:**

1 కిలోవాట్‌కు రూ.30,000

2 కిలోవాట్లకు రూ.60,000

3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78,000 లు వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. క్యాంపుల్లో పూర్తి సమాచారం సేవా సేతు అభియాన్ క్యాంపుల ద్వారా ప్రజలకు పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ పొందే ప్రక్రియ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు, నెట్ మీటరింగ్ తదితర అంశాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల్లో బ్యాంకర్లు, సోలార్ విక్రేతలు, ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొని వినియోగదారుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పథకం అమలుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించనున్నారని తెలిపారు. ప్రతి ఇంటినీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చడమే లక్ష్యం అర్హత ఉన్న ప్రతి గృహ వినియోగదారుడు పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తన ఇంటినే విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చుకోవాలని ఎస్ఈ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో సేవా సేతు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, పథకం ప్రయోజనాలను అర్హులైన ప్రతి గృహ వినియోగదారుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో సేవా సేతు క్యాంపులను సందర్శించి రూఫ్‌టాప్ సోలార్‌పై పూర్తి సమాచారాన్ని తెలుసుకుని పథకం ప్రయోజనాలను పొందాలని ఎస్ఈ కోరారు. పీఎం సూర్య ఘర్ పథకం లేదా సేవా సేతు క్యాంపులకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే ఏపీసీపీడీసీఎల్ 1912 కాల్ సెంటర్‌ను సంప్రదించి సమాచారం పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఈఈ లు పద్మావతి, రఘుబాబు, ఎస్ఎఓ శ్రీనివాస రెడ్డి, ఒంగోలు టౌన్ డిఈఈ కేవీ పాండురంగారావు,ఏఈ లు సంతోష్, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

# లక్ష్మీ చెన్నకేశవస్వామి హుండీలో రూ.15.13 లక్షల ఆదాయం



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 05**

పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఆదివారం హుండీల లెక్కింపు జరిగింది.ఆలయ కార్యనిర్వహణ అధికారి గొలమారి శ్రీనివాసులరెడ్డి, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ఆర్.కె. చైతన్య పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. గతంలో 4 నెలల 15 రోజులకు గాను రూ.12,45,666 ఆదాయం రాగా, ప్రస్తుతం 5 నెలల 19 రోజులకు గాను రూ.15,13,625 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో రాజ్యలక్ష్మీ సేవా సంఘం మహిళలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద వైద్య ఆరోగ్య కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 05**

తమ డిమాండ్ల పరిష్కారం కోసం వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం మార్కాపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14,600 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు వైద్య సేవలు అందిస్తున్నారని, వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి అమలవుతున్న వేతన కోతను ఎత్తివేసి 100 శాతం గ్రాస్ జీతాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగ భద్రత, భవిష్యత్ ప్రయోజనాలు కల్పించాలని కోరారు.తమ సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తున్నామని తెలిపారు.అక్టోబర్ 6న నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామని, అక్టోబర్ 7న స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, పారామెడికల్ సిబ్బంది నిరసనలు కొనసాగిస్తారని వెల్లడించారు. అయితే ఐ సి యు, క్యాజువాలిటీ, లేబర్ రూమ్ వంటి అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలిగించబోమని స్పష్టం చేశారు.

# ప్రజల సమస్యలకు త్వరిత పరిష్కారం

### జిల్లా పోలీసు అధికారి పంకజ్ కుమార్ మీనా





**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 05**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలకు త్వరిత పరిష్కారం చూపుతామని జిల్లా పోలీసు అధికారి పంకజ్ కుమార్ మీనా తెలిపారు.సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి 65 మంది బాధితులు తమ సమస్యలతో వచ్చారు. జిల్లా పోలీసు అధికారి ప్రతి ఫిర్యాదుదారుడితో నేరుగా మాట్లాడి సమస్యలను పూర్తిగా తెలుసుకున్నారు. భూ తగాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, భార్యాభర్తల వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా ముప్పై రోజుల గడువులో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే సహాయ పోలీసు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి చట్టపరమైన సహాయం అందించాలని సూచించారు.ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తేవాలని, బాధితులకు భరోసా కల్పించడమే పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓ ఎస్ డి నవజ్యోతి మిశ్రా, మార్కాపురం డి.ఎస్.పి నిమ్మగడ్డ సత్యనారాయణ, మార్కాపురం సీఐ అల్తాఫ్ హుస్సేన్, త్రిపురాంతకం సీఐ హస్సన్, జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు హాజరయ్యారు.

# కోటపాడులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**పొన్నలూరు పెన్ పవర్ అక్టోబర్ 5**

మండలంలోని కోటపాడు గ్రామంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక అధికారి పి నాగమణి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిస్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వి పుల్లారావు మాట్లాడుతూ పీజీ ఆర్ఎస్ వినతుల అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. పది సమస్యలపై స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్ బాబు ఆయా శాఖ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# కొమరోలు లోని ఏడవ నెంబరు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి మహోత్సవం





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 5**

కొమరోలు లోని ఏడవ నెంబర్ అంగన్వాడి కేంద్రంలో సోమవారం అంగన్వాడి మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గిద్దలూరు సిడిపిఓ మహిత ఆదేశాల మేరకు ఏడవ నెంబర్ అంగన్వాడి కేంద్ర కార్యకర్త ఎం అరుణకుమారి ఆధ్వర్యంలో అంగన్వాడి మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాన్ని రంగవల్లులతో రంగురంగుల తోరణాలతో అందంగా అలంకరించారు. అంగన్వాడీ కేంద్ర పరిధిలోని బాలింతలు, గర్భవతులు, తల్లులు, చిన్నారులను అంగన్వాడి మహోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లులు, బాలింతలు, గర్భవతుల కొరకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న ఎం .వి వై మిషన్, వాత్సల్య వంటి పథకాలను అంగన్వాడీ కార్యకర్త అరుణకుమారి వివరించారు. ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న పౌష్టికాహారం, పాలు గుడ్లు తదితర ఆహార పదార్థాలు తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అలాగే గర్భవతులు, బాలింతలు, తల్లులు ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకుంటూ వైద్య సిబ్బంది అందించే సలహాలు సూచనలను అనుసరించాలని ఆమె కోరారు. పోషణ అభియాన్ లో భాగంగా అంగన్వాడి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లుగా ఆమె తెలిపారు. ఆ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా హృదయేశ్వరి తల్లులు, బాలింతలు గర్భవతులు చిన్నారులు పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులకు సన్మానించిన రాంబాబు

## ప్రజల్లోనే ఉంటూ పార్టీకి అండగా నిలిచారని కొనియాడిన అన్నా రాంబాబు



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 05**

మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల ప్రజాప్రతినిధులకు వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో ఉన్న వైఎస్సార్సీపీ కార్యాలయంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, కో-ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలకు ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రజాప్రతినిధులందరినీ దుశ్శాలువాలు, పూలదండలతో సత్కరించారు.ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులందరూ గతంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రతి గ్రామంలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, సమస్యల పరిష్కారంలో వారు అందించిన సేవలు మరువలేనివని అన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల్లోనే ఉంటూ పార్టీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజా సేవలోనే ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు అన్నా కృష్ణచైతన్య పాల్గొని ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాజీ కౌన్సిలర్ నాయబ్ రసూల్ సతీమణికి నివాళులు

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 05**

గిద్దలూరు: పట్టణంలోని పాములపల్లె గేట్ వద్ద వద్ద 1 వ వార్డు మాజీ కౌన్సిలర్ సయ్యద్ నాయబ్ రసూల్ సతీమణి అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వారి నివాసం వద్దకు వెళ్లి పూల మాలతో నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మాజీ కౌన్సిలర్ లు, వార్డు నాయకులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# సిపిఎం పార్టీ మార్కాపురం జిల్లా బహిరంగ సభను జయప్రదం చేయండి

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబరు05**

గిద్దలూరు సిపిఎం పార్టీ కార్యాలయం లో సిపిఎం పార్టీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నస్యకులు ఆవులయ్య మాట్లాడుతూ ఈనెల 7 న మార్కాపురంలో జరుగుతున్న ర్యాలీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బహిరంగ సభ కరపత్రాన్ని ఆవిష్కరించార. టి ఆవులయ్య మాట్లాడుతూ జిల్లా ఏర్పడి 10 నెలలు అవుతున్న జిల్లా అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తంచేశారు . ఇప్పటికీ అన్ని శాఖలకు సంబంధించిన పూర్తి స్థాయి అధికారులను కేటాయించలేదన్నారు. మార్కాపురం జిల్లా అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించి చిన్న, మధ్యతరః పరిశ్రమలను అభివృద్ధి చేయాలన్నారు . జిల్లాలో ఉన్న వనరులను అభివృద్ధి చేయాలని, గిద్దలూరు నియోజకవర్గంలో లెదర్ ఫ్యాక్టరీ ప్రారంభించి ఉపాధి కల్పించాలన్నారు. వెనుకబడ్డ మార్కాపురం జిల్లా అన్ని విధాల అభివృద్ధి జరగాలంటే వెలిగొండ రెండవ దశ పనులు ప్రారంభించాలని కోరారు. జిల్లా అభివృద్ధిపై ఈనెల7 తేదీన ర్యాలీ బహిరంగ సభ జరుగుతుందని ఈ ర్యాలీ బహిరంగ సభలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కరపత్ర ఆవిష్కరణలో సిపిఎం పార్టీ నాయకులు బి నర్సింహులు, డి థామస్, డి శ్రీనివాసులు పాల్గొన్నారు.




# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు విద్య పునాది

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 05**

గిద్దలూరులోని సెయింట్ ఫాల్స్ ప్రాథమి పాఠశాలలో చదు వుతున్న బాల బాలికలకు యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ సభ్యుల సహకారంతో విద్యా సామాగ్రిని సోమవారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు పగిడి వేణు గోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాదని, బాల్య దశ నుంచి చదు వుపై ఆసక్తి పెంచుకుంటే ఉన్నత లక్ష్యాలను సాధిం చవచ్చనన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోన .స్టీవెన్ ప్రధానోపాధ్యాయులు ఓ. కొండా రెడ్డి ఉపాధ్యా యేతర సిబ్బంది. యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ సభ్య లు రత్నం సిద్దయ్య నరేంద్రరెడ్డి శోభారాణి పీరయ్య శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు విద్యా సామాగ్రి అందుకున్న విద్యార్థులు ఉపాధ్యాయులు సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



# పోకూరులో ఇంటింటికి బిన్ బ్యాగుల పంపిణీ



**వలేటివారిపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 5:**
గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తేదేపా నాయకులు నవులూరి సుబ్బానాయుడు, సోమినేని తిరుమలరావు తెలిపారు. సోమవారం పోకూరు గ్రామంలో ఇంటింటికీ బిన్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి బిన్ బ్యాగుల్లోనే పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఇష్టానుసారంగా పడవేయకుండా క్లాప్ మిత్రులకు అప్పగించాలని కోరారు. చెత్తను ఇళ్ళల్లో వేరు చేయడం వల్ల రీసైక్లింగ్ సులభమవుతుందని, గ్రామ పరిశుభ్రత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తేదేపా నాయకులు నవులూరి సుబ్బానాయుడు, సోమినేని తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భైరవేశ్వర స్వామి ఆలయంలో నేడు వరుణ యాగం



**సి.ఎస్.పురం, పెన్ పవర్ అక్టోబర్ 5**
జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ ప్రసిద్ధి చెందిన పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోన భైరవేశ్వర స్వామి ఆలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు మంగళవారం వరుణ యాగ హోమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వంశీకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, కుటుంబాలలో సుఖశాంతుల కోసం, ఆరోగ్యం దీర్ఘాయుష్ కోసం, ధనధాన్య అభివృద్ధి కోసం, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శాస్త్రోక్తంగా వరుణ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాగంలో భక్తులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని వరుణ యాగం హోమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

## సదరం సర్టిఫికెట్ల జారీలో అవినీతికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### - డిఆర్ఓకు దివ్యాంగుల వినతి



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 05**
ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో సదరం సర్టిఫికెట్ ల జారీ లో అవినీతికి పాల్పడుతున్నట్లు న్యూరాలజీ డాక్టర్ సామాజాల. హరి పై వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ వారిచే విచారణ జరిపి దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ ను నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. కాలేషా కోరారు. ఈ మేరకు సోమవారం ప్రకాశం భవనం లోని పి జి ఆర్ ఎస్ చాంబర్లో డిఆర్ఓకు నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి నాయకులు వినతి పత్రం అందజేశారు. గత కొన్ని నెలలుగా ప్రకాశం జిల్లా ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో అర్హులైన దివ్యాంగులకు జారీ చేసే సదరం సర్టిఫికెట్ లలో అవినీతికి పాల్పడుతున్న న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. సామజాల.హరి పై వచ్చిన ఫిర్యాదులను పరిగణలలోకి తీసుకొని రిమ్స్ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్. ఎస్. మాణిక్యారావు అక్టోబర్ తేదీ.01 న విచారణకు ఆదేశించి బాధిత దివ్యాంగులను రావాలని కోరడంతో పలువురు దివ్యాంగులు సంఘ నాయకులు కూడా విచారణకు హాజరయ్యారు. విచారణ కమిటీ సభ్యులు డాక్టర్. మస్తాన్ బాషా మిమ్మల్ని మేము పిలవలేదు. మీరు ఎందుకు వచ్చారు అని ఆత్మ గౌరవం దెబ్బతీసే విధంగా మాట్లాడటం వెంటనే అక్కడే నిరసన వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు. వీటన్నిటిని చూస్తుంటే సంబంధిత డాక్టర్. ఎస్. హరి ని రక్షించడానికి సూపర్డెంట్ తో పాటు విచారణ కమిటీ సభ్యులు కూడా ప్రయత్నిస్తున్నట్టు అర్థమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దివ్యాంగుల పట్ల వివక్షత చూపకుండా వెంటనే డాక్టర్ సామజాల. హరి పై విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్స్ డిపార్ట్మెంట్ వారి చేత విచారణ జరిపి శాఖ పరమైన చర్యలతో పాటు దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. డిఆర్ఓ ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు ముల్లా. మదర్ వలి, ఎం. కృష్ణ, వహీదా, జిలాని, సయ్యద్. ఆరిఫా, రజాక్, తదితరులు ఉన్నారు.

# మార్కాపురం క్రీడాకారుడి ప్రతిభ - జూనియర్ నేషనల్స్ కు ఎంపిక

## రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన డైవర్స్ కాలనీ యువకుడు-చెన్నై వేదికగా ఈ నెల 23 నుంచి జాతీయ పోటీలు

### ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న యువ అథ్లెట్

**మార్కాపురం (జిల్లా స్టాపర్) పెన్ పవర్ అక్టోబర్ 05**
మార్కాపురం పట్టణం డైవర్స్ కాలనీకి చెందిన యువ అథ్లెట్ బత్తుల మణికంఠ జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. కర్నూలు జిల్లా ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో అక్టోబర్ 3, 4 తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2026 పోటీల్లో అతను అద్భుత ప్రదర్శన కనబరిచాడు. అండర్-18 ఏజ్ కేటగిరీలో 200 మీటర్ల పరుగు పందెంలో పతకం సాధించి జూనియర్ నేషనల్స్ కు అర్హత సాధించాడు. ఈ నెల 23వ తేదీ నుంచి చెన్నైలో జరగనున్న జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొననున్నాడు.

**చిన్న వయసు నుంచే పతకాల పంట..:** మణికంఠ ప్రస్తుతం సాయి అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నాడు. అండర్-14 కేటగిరీ నుంచే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటూ అనేక పతకాలు సాధించాడు. మార్కాపురం తరపున పలుమార్లు పతకాలు తెచ్చి పట్టణానికి గుర్తింపు తీసుకొచ్చాడు.

**జాతీయ స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యం..**
క్రమం తప్పకుండా సాధన చేస్తూ జాతీయ స్థాయిలో రాణించాలన్నదే మణికంఠ లక్ష్యం. అతని క్రమశిక్షణ, పట్టుదలను చూసి కోచ్ లు కూడా అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతాడని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

**దాతలు ఆదుకోవాలి - ప్రతిభకు చేయూతనివ్వండి..**
నిరుపేద కుటుంబానికి చెందిన మణికంఠకు జాతీయ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారింది. ప్రయాణ ఖర్చులు, కిట్, ఇతర అవసరాలకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. ప్రతిభ ఉన్న ఈ యువ క్రీడాకారుడిని ప్రోత్సహించేందుకు దాతలు, ప్రజా ప్రతినిధులు, క్రీడాభిమానులు స్పాన్సర్ గా ముందుకు రావాలని కోచ్ లు, కుటుంబ



సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. మణికంఠకు చేయూతనిస్తే భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించి మార్కాపురం ఖ్యాతిని మరింత పెంచుతాడని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

# గ్రామీణ అభివృద్ధికి మరో అడుగు



**పుల్లల చెరువు, పెన్ పవర్ అక్టోబర్ 5**
గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పుల్లల చెరువు టీడీపీ మండల అధ్యక్షుడు పోట్ల గోవింద్ అన్నారు.పుల్లలచెరువు మండలంలోని పెద్ద పీఆర్సీ, చిన్న పీఆర్సీ తాండా పంచాయతీల్లో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షల విలువైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా పోట్ల గోవింద్ మాట్లాడుతూ రెండు పంచాయతీలకు చెరో రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించి సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి మార్గం సుగమమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు అత్యవసరంగా అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నట్లు చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగడంతో పాటు గ్రామాల్లో పారిశుధ్యం, రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పోట్ల గోవింద్ అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యదర్శి, మండల సీనియర్ నాయకుడు కాకర్ల కోటయ్య, క్లస్టర్ ఇన్చార్జి, మండల సీనియర్ నాయకుడు రెంటపల్లి సుబ్బారెడ్డి, పుల్లలచెరువు సొసైటీ చైర్మన్ నారు వెంకట్రామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శనగ వెంకటేశ్వరరెడ్డి, మండల ఎస్టీ నాయకుడు దుప్లవత్ గోపాల్ నాయక్, పీఆర్సీ నాయకులు హనుమంతు నాయక్, చిన్న మంత్రు నాయక్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ-సంజీవని కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి - జిల్లా కలెక్టర్ పి రాజా బాబు





**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 05**
ప్రకాశం జిల్లాలో ఈ-సంజీవని టెలిమెడిసిన్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి రాజా బాబు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలో ఈ-సంజీవని కార్యక్రమం అమలు తీరు, ప్రజలకు అందుతున్న సేవలు, అవసరమైన మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రకాశం జిల్లాలో మొత్తం 62 ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో, ఇందులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు.. అర్బన్ హెల్త్ సెంటర్లలో ఈ-సంజీవని కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తించిన ఆరోగ్య కేంద్రాల్లో పేషెంట్ కేర్ కోఆర్డినేటర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ద్వారా ఈ-సంజీవని సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నట్లు తెలిపారు. రోగులకు నాణ్యమైన సాధారణ వైద్య సేవలతో పాటు మాతా-శిశు సంరక్షణ, చిన్నారుల వైద్య సేవలు, అంటువ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులకు సంబంధించిన వైద్య సలహాలు, కౌన్సెలింగ్, ఫాలోఅప్ సేవలు, వైద్య నిపుణుల టెలీ కన్సల్టేషన్, మానసిక ఆరోగ్య సమస్యలకు సంబంధించిన సేవలు అందించనున్నట్లు వివరించారు. అదే విధంగా, జిల్లా ఆసుపత్రి కోఆర్డినేటర్ డాక్టర్ కె.వి. లక్ష్మీకుమారి మాట్లాడుతూ, వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాలోని 7 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, కందుకూరు ఏరియా ఆసుపత్రులను ఈ-సంజీవని సేవల కోసం గుర్తించినట్లు తెలిపారు. ఆయా ఆసుపత్రుల్లో అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసి ప్రజలకు టెలిమెడిసిన్ సేవలను, స్పెషలిస్ట్ వైద్యుల అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా ఆసుపత్రి(రిమ్స్ )ప్రతినిధులు ఈ సంజీవిని కార్యక్రమానికి ఒక ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేశామని తద్వారా స్పెషలిస్ట్ సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ బి శ్రావణ్ కుమార్ డాక్టర్ నబి,డాక్టర్ నిరంజన్, మరియు ఎన్ హెచ్ ఎం ప్రోగ్రాం అధికారి సుబ్బలక్ష్మి, జిల్లా మాస్ మీడియా అధికారి బి నరసింహారావు, డిప్యూటీ అధికారి కె ఏ రాజు, ప్రోగ్రాం అధికారులు ప్రభాకర్ రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర,జిల్లాస్థాయి జట్లకు ఎంపికైన అడవిరాజుపాలెం హైస్కూల్ విద్యార్థులు

## క్రీడా ప్రతిభకు హృదయపూర్వక అభినందనలు



**గుడ్లూరు, పెన్ పవర్, అక్టోబర్ 05:**
మండలంలోని అడవిరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక అవడంతో పాఠశాల ప్రాంగణంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి క్రీడా విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం దొడ్డవరం--తెల్లబాడులో జరిగిన ఎస్జీఎఫ్ స్కూల్ గేమ్స్లో ప్రతిభ చూపిన గుండ్లపల్లి బ్రహ్మణి అండర్-19 విభాగంలో, గుండ్లపల్లి రామ్ చరణ్ తేజ అండర్-17 విభాగంలో హ్యాండ్‌బాల్ లో ప్రకాశం జిల్లా జట్టు తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన సబ్‌జూనియర్స్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన గోచిపాతల సౌజన్య, తాటిపర్తి మహి ప్రకాశం జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందనల సభలో క్రీడా విద్యార్థులతో పాటు ఎస్.ఏ(పీఈ) ధనేకుల బలరామయ్యను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడాకారులకు అవసరమైన ఆర్థిక సహాయం అందించిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గుండ్లపల్లి రామ కోటయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు జి.రాజా అధ్యక్షత వహించారు. ప్రత్యేక కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ క్రీడల్లో విజయం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తుంది అని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కె.వరలక్ష్మి, పిగిలి మనోహరం, కె.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు, సిహెచ్.వసంతకుమారి, జి.కొండయ్య, కె.శ్రీనివాసులు, ఆర్.రమణారావు, పి.మునుస్వామి, పి.యోహాను తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# పోలీస్ పిజి ఆర్ఎస్‌కు 100 ఫిర్యాదులు



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 05**
ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)యన్.యుగంధర్ బాబు, పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం (పిజి ఆర్ఎస్)" ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 100 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారులతో పోలీస్ అధికారులు ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో పోలీసు కార్యాలయాలకు వచ్చే బాధితులకు పోలీసు శాఖ భరోసాగా నిలవాలని, ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్/జాబ్ ఫ్రాడ్, అత్తరింటి వేదింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు ట్రాఫిక్ సీఐ సి.హెచ్ హాజరత్తయ్య, కొండేపి ఎస్సై త్యాగరాజు, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై యాస్మిన్,ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా అంగన్వాడి ఉత్సవ వేడుకలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 5**
కేంద్ర రాష్ట్ర బిజెపి పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివియన్ మాధవ్ పిలుపుమేరకు జిల్లా బిజెపి అధ్యక్షులు పి వి కృష్ణారావు సూచనలతో వెంకటాపురం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం మరియు 25 వసంతములు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ ఉత్సవంలో బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి ఎస్ పురం మండల ఇన్చార్జి కొండిశెట్టి వెంకటరమణయ్య పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశల మేరకు 30 మంది అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లను సిబ్బందికి మరియు ఆఫీసర్లకు శాలువాలతో సన్మానించారు ఈ సందర్భంగా కొండిశెట్టి వెంకటరమణయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి, వారి చదువు, ఆరోగ్యం, పోషకాహారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని,అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్య, ఆరోగ్య సంరక్షణ సేవల గురించి అవగాహన కల్పించారు.ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం గురించి తెలియజేశారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని , గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పిల్లలను అధిక సంఖ్యలో అంగన్వాడి కేంద్రములకు తీసుకురావాల్సిన బాధ్యత అంగనవాడి వర్కర్లకు ఉందని తెలియజేశారు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళా సంక్షేమ ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకటసత్యం, జాజం చిన్న సుబ్బయ్య, షేక్ నాయబ్ రసూల్, అంగన్వాడి సూపర్వైజర్ గోళ్ళ పద్మజ , ఆఫీసర్స్ వెంకట్, గోపి, అంగన్వాడి లీడర్స్ గద్దె అనిత, సచివాలయం పోలీస్ అంగనవాడి వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వభారతి పాఠశాలలో అంగరంగ వైభవంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు





**గిద్దలూరు: పెన్ పవర్ అక్టోబర్ 05**

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని స్థానిక విశ్వభారతి పాఠశాలలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం నిర్వహించారు., ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో, వివిధ సంఘాల సభ్యులు, విశ్వభారతి పాఠశాల యాజమాన్యం సహకారంతో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. విద్యార్థుల ఎదుగుదలే లక్ష్యంగా భావి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల కృషిని కొనియాడుతూ, ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు 'గురుబ్రహ్మ' పురస్కారాలను అందజేశారు. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, మరుగున పడిన స్వాతంత్ర్యోద్యమ వీరుల చరిత్రను వీరగాథల రూపంలో పరిచయం చేసి, దేశభక్తిని విద్యార్థుల్లో పెంపొందించాలని కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ ఈ వి. రమణ బాబు మాట్లాడుతూ, అన్ని వృత్తులకు పునాది వేసేది గురువేనని పేర్కొన్నారు. ప్రతి పురస్కారం, ప్రతి సత్కారం బాధ్యతను మరింత పెంచుతూ గుర్తుచేస్తాయని, ఆ స్ఫూర్తితో ఉపాధ్యాయులు ముందుకు సాగాలని సూచించారు. విశ్వభారతి పాఠశాల కరస్పాండెంట్ రంగస్వామి రెడ్డి మాట్లాడుతూ, "ఇంతటి బృహత్తర కార్యక్రమానికి మా పాఠశాల వేదిక కావటం ఎంతో గర్వంగా, గౌరవంగా భావిస్తున్నామన్నారు. గురువుల అనుభవాలు, సేవా స్ఫూర్తి మా ఉపాధ్యాయులకు ప్రేరణగా నిలవాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, వివిధ మండలాల విద్యాశాఖాధికారులు, విశ్రాంత ఉపాధ్యాయులు, మానవతా సేవా సంస్థ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల చే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## అంగన్వాడి ఉత్సవాల్లో పోషణపై అవగాహన

* గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై సూచనలు



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, అక్టోబర్ 5:**అంగన్వాడి ఉత్సవాలు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 8 వరకు, పోషణ మాసం సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 7 వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు.పోషక విలువలున్న ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణీలకు శ్రీమంతాల కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న మిషన్ వాత్సల్య, ప్రధానమంత్రి మాతృ వందన యోజన ( పిఎంఎంవివై ) తదితర పథకాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లను తల్లులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎంపీడీవో బి హెచ్ వి రమణ బాబు, సీలేరు ఎస్ఐ యాసిన్ , ఐసిడిఎస్ సూపర్వైజర్ మోహిని అంగన్వాడి సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## 117వ వార్డు స్థాయి సమావేశంపై వైఎస్సార్‌సీపీ నాయకుల చర్చలు

త్వరలో విస్తృత వార్డు సమావేశం నిర్వహణకు సన్నాహాలు



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 5 :** పెందుర్తి నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 117వ వార్డుకు సంబంధించిన ముఖ్య సమావేశం సోమవారం నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు. త్వరలో నిర్వహించనున్న 117వ వార్డు స్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. వార్డులో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వార్డు స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడంతో పాటు, స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని వాటిపై నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరంపై కూడా నాయకులు చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు పీతల అప్పలరాజు, స్టేట్ యూత్ స్పోక్స్‌పర్సన్ చందు యాదవ్, నియోజకవర్గం వీవర్స్ వింగ్ నాయకులు కన్నూరు జగదీష్, పీతల విష్ణు, డి. నేను మూర్తి, కిల్లి అప్పారావు, వాడపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూ. చీడిపాలెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల కు "ఆల్బెండజోల్ "మాత్రల పంపిణీ-డాక్టర్ హేమంత్.



**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 5 :** మండలంలోని యూ. చీడిపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను పి హెచ్ సి వైద్యాధికారి హేమంత్ కుమార్ విద్యార్థులందరికి వేయించారు. ఇక్కడ పాఠశాలలో చదివే 150 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలతో జాతీయ నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ డిసార్డర్స్ ప్రోగ్రామ్ కింద పిల్లలందరికీ ఆయా టాబ్లెట్స్ ను డాక్టర్ హేమంత్ స్వయంగా వేయించారు. అనంతరం డాక్టర్ హేమంత్ చౌదరి మాట్లాడుతూ... పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఆరు నెలల కొసారి విధిగా ఆయా రెండు రకాల మాత్రలను తప్పనిసరిగా విద్యార్థులకు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దుప్పులవాడ పీజీఆర్ఎస్‌కు 25 దరఖాస్తులు

సమస్యల పరిష్కారానికి చర్యలు: బిహెచ్వి ఎంపీడీవో రమణబాబు




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 5:**అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 25 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రమణబాబు తెలిపారు.మంచినీటి సదుపాయం, చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు, పంట పొలాలకు సాగునీరు, ఇళ్ల సమస్యలతో పాటు వివిధ అంశాలపై గ్రామస్థులు వినతులు సమర్పించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించి, జిల్లా స్థాయికి సంబంధించిన వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అవసరమైన పనులకు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## దుప్పులవాడలో వరి పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

* పురుగు, తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 5:**గూడెంకొత్తవీధి మండలంలోని దుప్పులవాడ గ్రామంలో వరి పంటలను మండల వ్యవసాయ అధికారి సురేష్ పరిశీలించారు. ప్రస్తుతం పంట బూటింగ్ దశలో ఉన్నందున పంట పరిస్థితిని పరిశీలించి, పురుగు, తెగుళ్లు, ఎరువుల యాజమాన్యంపై రైతులకు పలు సూచనలు చేశారు. వరి పొలాల్లో పాముపొడ తెగులు లక్షణాలు కనిపిస్తే హెక్సాకోనజోల్ ఎకరానికి 400 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మందు కాండం కింది భాగం, ఆకుమొన ప్రాంతాలకు బాగా తగిలేలా పిచికారీ చేయాలని తెలిపారు. దోమ ఉధృతి కనిపించినప్పుడు డైనోటెఫ్యూరాన్ 20 శాతం ఎకరానికి 80 గ్రాములు లేదా పైమెట్రోజైన్ 50 శాతం ఎకరానికి 120 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.పురుగులు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి వ్యవసాయ శాఖ సాంకేతిక సూచనల మేరకు సిఫార్సు చేసిన మందులను మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. అవసరం లేకుండా పురుగుమందులు పిచికారీ చేయకుండా సమగ్ర పురుగు, తెగులు యాజమాన్య పద్ధతులను పాటించాలని కోరారు.కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఆనందపురం పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు




**ఆనందపురం,పెన్ పవర్ అక్టోబర్ 5:**ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ఆనందపురం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఆనందపురం వివేకానంద జూనియర్ కళాశాలలో నిర్వహించిన గట్కా అండర్-19 విభాగంలో ముగ్గురు, గిడిజాల సావన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన గట్కా అండర్-17 విభాగంలో ఇద్దరు అర్హత సాధించారు. కొమ్మాది స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన జూడో పోటీల్లో ముగ్గురు, రగ్బీ అండర్-14 విభాగంలో ఒకరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, బుజ్జి, వెంకటరాజు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ప్రజలఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం కృషి

### టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 5**

పేద మధ్య తరగతి ప్రజలందరికి అన్ని రకాల వ్యాధులకు ఖరీదైన వైద్యాన్ని కూటమి ప్రభుత్వం అందించేందుకు కృషి చేస్తుందని టీడీపీ నియోజకవర్గఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యాశాలలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని సేవా సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిధిగా హాజరై గైనకాలజీ విభాగం, ఆర్ ఓ, ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేత్రుత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య శాలలో అన్ని రకాల వైద్య సేవలను, అర్హత కలిగిన ప్రముఖ వైద్యులతో ఉచితంగా అందిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా వైద్యం అందకుండా ఎవరు బాధపడకూడదని అదనపు సిబ్బందిని నియమించి వైద్యం తో పాటు ఖరీదైన మందులను అందిస్తున్నట్లు తెలిపారు. గుండె సంబందించిన వ్యాధులకు, గుండెపోటు వచ్చిన అత్యవసర సమయంలో ఆదుకునేందుకు ఖరీదైన ఇంజక్షన్ ఉచితంగా అందిస్తున్నారని అన్నారు.వైద్య శాలలో రోగుల అవసరార్థం మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశామని. త్వరలో అన్ని సమస్యలు తీర్చి మరిన్ని సేవలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున, హాస్పటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు కొత్తమాసు సుబ్రహ్మణ్యం, తోట మహేష్ నాయుడు, రమణమ్మ, నాయకులు కందుల నారాయణ రెడ్డి,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి పాలుగుళ్ల ప్రతాప్ రెడ్డికి ఘన సత్కారం

### ప్రజా సేవకు గుర్తింపుగా అభినందనలు



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 05**

గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లి గ్రామ మాజి సర్పంచ్ , మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలుగుళ్ల ప్రతాప్ రెడ్డికి బెంగళూరులో ఘన సత్కారం లభించింది. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ, ప్రజా జీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రతాప్ రెడ్డిని కర్ణాటక తెలుగు ప్రజా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బెంగళూరులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలుగు ప్రజలు, కర్ణాటక తెలుగు ప్రజా సమితి ప్రతినిధులు పాల్గొని ప్రతాప్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక తెలుగు ప్రజా సమితి ప్రధాన కార్యదర్శి దాసరి బాబు రాజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ప్రతాప్ రెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కృష్ణంశెట్టిపల్లి గ్రామ సర్పంచ్‌గా, మాజీ ఎంపీటీసీగా పనిచేసిన సమయంలో ప్రతాప్ రెడ్డి ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. బెంగళూరులో నివసిస్తున్న గిద్దలూరు ప్రాంతానికి చెందిన తెలుగు ప్రజలు కూడా ప్రతాప్ రెడ్డిని ఆత్మీయంగా కలుసుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధి స్థాయి వ్యక్తికి బెంగళూరులో ఘన సత్కారం జరగడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజల ఐక్యత, ఆత్మీయతకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా తెలుగు ప్రజల సంక్షేమం, ఐక్యత కోసం కర్ణాటక తెలుగు ప్రజా సమితి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సత్కారం తనపై ఉన్న అభిమానానికి నిదర్శనమని పాలుగుళ్ల ప్రతాప్ రెడ్డి పేర్కొంటూ, తనను ఘనంగా సత్కరించిన కర్ణాటక తెలుగు ప్రజా సమితి ప్రతినిధులకు, దాసరి బాబు రాజేంద్ర కుమార్‌కు, బెంగళూరులోని తెలుగు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నారాయణస్వామి ఆదాయం రూ. 1,66,588/- లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 5**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,66,588/-లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ.50,680/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా జమ .22,200/- లు, శాశ్వత అన్నదాన పథకమునకు రూ.78,076/- లు, స్వామివారి కానుకగా సమర్పించినది రూ.10,116/- లు, పంచామృత అభిషేకమునకు రూ.5,516/- లు వచ్చినట్లు తెలిపారు శాశ్వత అన్నదాన పథకమునకు మార్కాపురం జిల్లా పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామ వాస్తవ్యులు దారపునేని సూర్యనారాయణ ధర్మపత్ని మహా లక్ష్మమ్మ రూ.50,000/-లు అందజేసినట్లు తెలిపారు.

## విబి జి -రామ్ జి ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

### ఎమ్మెల్యే ముత్తుములకు వినతి



**గిద్దలూరు, పెన్ పవర్, అక్టోబర్ 5**

వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ -గ్రామీణ (వి.బి జి రామ్ జి)ఉపాధి హామీ పథకం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు సోమవారం గిద్దలూరు నియోజకవర్గ పరిధి ఆ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 2024లో ఏర్పాటైన ఇంటర్నల్ కమిటీకీ,2026లో ఏర్పాటైన ఎంపవర్ కమిటీలకు ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యలు నివేదించినప్పటికీ పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలు, నిర్దేశాల మేరకు సమర్ధవంతంగా పనిచేస్తున్నా వేతనాల విషయంలో ఎలాంటి ఎదుగూ బొదుగూ లేకుండా ఏడు సంవత్సరాలుగా జీతభత్యాల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా పని చేస్తున్నామన్నారు. ఈ నెల 10వతేదీ లోపు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎస్ రామసుబ్బారెడ్డి, కోటిలింగారెడ్డి,కటారు శ్రీను తదితరులు ఉన్నారు.

## నవోదయలో విద్యార్థులతో మోడల్ యూత్ గ్రామసభ నిర్వహణ

### - పంచాయతీ విధుల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం లక్ష్యం

### - నవోదయ ప్రిన్సిపాల్ శివరాం



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 05**

ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయం లో సోమవారం మోడల్ యూత్ గ్రామసభ కార్యక్రమం జరిగింది. మోడల్ యూత్ గ్రామసభ కార్యక్రమానికి ముఖ్య అతిథులు 19వ వార్డు మాజీ కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు (చిన్నారి), విద్యాలయ ప్రిన్సిపల్ సి.శివరాం, సీనియర్ టీచర్ యన్. తాతయ్య జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం ముఖ్య అతిథి ఈదర చిన్నారి మాట్లాడుతూ నవోదయ విద్యాలయంలో మోడల్ యూత్ గ్రామసభను ఘనంగా నిర్వహించడం వల్ల విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ గ్రామ సభ వల్ల గ్రామంలో జరిగే పలు కార్యక్రమాలను విద్యార్థులు గ్రామ సభ యొక్క విధి విధానాలను సభలో ఉండే ప్రతి ఒక్క పాత్రను వారు నిర్వహించే విధి విధానాలను తిలకించి ఆనందించి అభినందించారు. విద్యాలయ ప్రిన్సిపల్ సి.శివరాం మాట్లాడుతూ పీఎం శ్రీ ఆక్టివిటీ భాగంగా విద్యాలయం నందు మోడల్ యూత్ గ్రామసభని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యాలయ 10వ తరగతి చదువుతున్న విద్యార్థి జయదీప్ సర్పంచ్ పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో యన్. తాతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీనియారిటీ లిస్టుపై 6 వ తేదీ లోగా అభ్యంతరాలను తెలియచేయాలి

### - డిఇఓ సి వి రేణుక

**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 05**

స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటుకు సంభందించి జోన్ నందు పని చేయుచున్న సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్స్ యొక్క సినియారిటి లిస్టును ప్రకాశం జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు వెబ్ సైట్ ఙఙఙ.నవశీజూ‌త్షుఝుఎ.ఞశీఎ నందు అప్లోడ్ చేయుట జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారిణి సి.వి.రేణుక ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున ఆ సీనియారిటి లిస్టు నందు ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే అక్టోబర్ 06వ తేదీ సాయంత్రం 05.00 లోపు తెలియజేయవలసినదిగా డిఇఓ కోరారు.

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

### - కొండపి నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో నాయకులు, కార్యకర్తలకు మంత్రి డా. స్వామి పిలుపు





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 05**

ఈ నెల 9 వ తేదీన జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండపి నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో సోమవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం ఐటిసి వద్ద దామచర్ల సత్య కార్యాలయంలో కొండపి నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు కనిగిరి ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండపి నియోజకవర్గంలోని నర్సింగోలులో పర్యటించి 8,000 మందికి పైగా రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేయనున్నట్లు తెలిపారు. కలికివాయి, బిట్రగుంట, నర్సింగోలు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం నర్సింగోలులో ముఖ్యమంత్రి పర్యటన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గ పర్యటనకు అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, రైతులు, కూటమి కార్యకర్తలు పాల్గొనేలా చూడాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ బూత్ ఇంచార్జ్ లు అందరూ సమన్వయంతో పని చేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ సమావేశంలో కొండపి నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగాల పేరుతో భారీ మోసం.. నిందితుడి అరెస్ట్




**మార్కాపురం (కంభం) పెన్ పవర్ అక్టోబర్ 5**

రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన ఘరానా మోసగాడిని కంభం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.4.50 లక్షల విలువైన నగదు, సెల్ ఫోన్లు, కంప్యూటర్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన చెరుకూరి శ్రీను అనే వ్యక్తి మూడు నెలల క్రితం కంభం వచ్చి వాసవి స్కూల్ సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. రావిపాడు రోడ్డులో జిరాక్స్ షాపు నడుపుతూ తాను రైల్వే ఇన్‌స్పెక్టర్‌నని, పెద్ద అధికారులతో పరిచయాలున్నాయని నమ్మించాడు. కంభం, మార్కాపురం రైల్వే స్టేషన్లలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి నుంచి డబ్బులు వసూలు చేశాడు.పెద్దనల్లకాలువకు చెందిన పిల్లి చరణ్ రాజ్ వద్ద రూ.66,500, పులివెందులకు చెందిన భరత్ కుమార్ రెడ్డి వద్ద రూ.4.88 లక్షలు, ఇంకొల్లుకు చెందిన శాలేము రాజు వద్ద రూ.6.28 లక్షలు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడిపై గతంలోనూ అనకాపల్లి, గోదావరి, శ్రీకాకుళం, నల్గొండ జిల్లాల్లో ఇదే తరహా కేసులు ఉన్నాయని, జైలుకు వెళ్లి వచ్చాక మళ్లీ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. కంభం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 114/2026 గా కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.3.20 లక్షల నగదు, రెండు ఫోన్లు, కంప్యూటర్ స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు మెరిట్ ప్రకారమే వస్తాయని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, ఎవరైనా డబ్బులు అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ పంకజ్ కుమార్ మీనా సూచించారు. కేసును ఛేదించిన సీఐ మల్లికార్జున, ఎస్సై శివకృష్ణారెడ్డి, సిబ్బందిని మార్కాపురం డి.ఎస్.పి సత్యనారాయణ అభినందించారు.

# మంగినపూడి నుండి అనంతవరం రహదారి నిర్మాణానికి రూ : 3.70 కోట్లు

### శంకుస్థాపన చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి





**దొనకొండ అక్టోబర్ 5 పెన్ పవర్**

మండల పరిధిలోని మంగినపూడి నుండి అనంతవరం వరకు బి.టి. రహదారి నిర్మాణానికి గాను రూ. 3.70 కోట్లు పల్లె పండుగ - 3.ా ద్వారా మంజూరు కాగా, దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోమవారం ఘనంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. రహదారుల అభివృద్ధి ఆర్థిక వ్యవస్థకు, ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు మూలస్తంభం. మంగినపూడి, అనంతవరం గ్రామాల మధ్య ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, రైతులకు తమ పంట ఉత్పత్తులను సమీప మార్కెట్లకు తరలించడం ఎంతో సులభమవుతుంది. నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది." ఈ రహదారి నిర్మాణంతో మంగినపూడి, అనంతవరం మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలియజేసారు. ఈ కార్యక్రమం లో దర్శి ఏఎంసి చైర్మన్ దారం నాగవేణి - సుబ్బారావు, దొనకొండ మండల టిడిపి అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, మాజీ మండల టిడిపి అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వర రావు, మండల ఐ.టిడిపి మండల అధ్యక్షులు వై. కె. చౌదరి, దొనకొండ టౌన్ టిడిపి అధ్యక్షులు షేక్ తోహిద్, రమణ యాదవ్, గాలేయ్య, నూనె డేవిడ్ సన్, వేంకటాద్రి, షేక్ ఫయాజ్ మండలం లోని వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు స్థానిక ప్రజలు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు విశేష సంఖ్యలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

# నారాయణస్వామి ఆలయంలో నేడు వరుణ యాగం

### సకాలంలో వర్షాలు కురవాలని వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు

### ఈవో గిరిరాజు నరసింహబాబు

**సి.ఎస్.పురం, పెన్ పవర్ అక్టోబర్ 5**

సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మండలంలోని మిట్టపాలెం గ్రామంలో వేం చేసియున్న నారాయణస్వామి దేవస్థానం ఆవరణలో నేడు వరుణ యాగం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ వరుణ యాగంలో వేద మంత్రోచ్ఛారణలతో వరుణ దేవుడిని ఆరాధించి, లోకక్షేమం, సకాలంలో వర్షాలు, జలసమృద్ధి కోసం ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్షాధారంగా వ్యవసాయం సాగించే రైతులకు సమృద్ధిగా వర్షాలు కురవడం, ప్రజల జీవనానికి నీరు ఎంతో కీలకమని అన్నారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వరుణ యాగంలో భాగస్వాములై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయాలని కోరారు.

## నల్లమడుగుల ఎస్టీ కాలనీలో కార్డెన్ సెర్చ్

### నాటు తుపాకీ, కత్తి స్వాధీనం.. వ్యక్తిపై కేసు నమోదు





**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 5**

మండలంలోని నల్లమడుగుల ఎస్టీ కాలనీలో పామూరు సిఐ డి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. సి.ఎస్.పురం ఎస్సై వెంకటేశ్వరరెడ్డి, వెలిగండ్ల ఎస్సై కోటేశ్వరరావు, సర్కిల్ సిబ్బంది తో కలిసి కాలనీలోని ఇళ్లు, రహదారులు, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 21 వాహనాలను పరిశీలించారు.తనిఖీల్లో భాగంగా కాలనీలోని ఇళ్లను పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు రాగి ఏమయ్య కుమారుడు ఏసయ్య ఇంటి పరిసరాలను పరిశీలించగా, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు లేకుండా నాటు తుపాకీ, కత్తి వంటి ఆయుధాలను గుర్తించారు. భారత ఆయుధ చట్టం ప్రకారం ఎటువంటి అనుమతులు లైసెన్సులు లేకుండా నాటు తుపాకిని కలిగి ఉండటం నేరం కనుక ఏసయ్యపై సి.ఎస్.పురం ఎస్సై వెంకటేశ్వరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను సమిష్టిగా గెలిపించాలి...!

- సెగ్మెంట్ వారీగా అవగాహన సదస్సులు...
- మండల టిడిపి ప్రధాన కార్యదర్శి "తోటా దొరబాబు"



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 5:** రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి గెలిపించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, పేర్కొన్నారు. సోమవారం మండలంలో ప్రసిద్ధిగాంచిన ఎర్ర గుండమ్మ ఆలయ సన్నిధిలో శరభన్నపాలెం సెగ్మెంట్ కు టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దొరబాబు, సాంబశివరావు మాట్లాడుతూ...నియోజవర్గ స్థాయిలో కూటమి నాయకులు ఇప్పటికే ప్రత్యేక సమావేశం కొయ్యూరులో నిర్వహించారని అలాగే మండల స్థాయిలో కూటమి నాయకులకు కలసి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి టిడిపి ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో మండల స్థాయిలో పంచాయితీ, ఎంపీటీసీ సెగ్మెంట్ వారీగా పోటీ చేసే ఆశావహులు ఎవరైతే ఉన్నారో వాళ్ళందరూ అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఆ కమిటీలో కూటమి నాయకులు నిర్ణయం తీసుకొని పంచాయతీలు ఎంపీటీసీ అభ్యర్థులగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ ఉపాధ్యక్షురాలు గాం రమాదేవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజేశ్వరి, కే వరలక్ష్మి, పనసల ఇందిరా వెలగల పాలెం టిడిపి పంచాయతీ ఇంచార్జ్ ఇరవాడ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దారకొండ నారాయణమూర్తి, జంపా వెంకటరమణ యూనిట్ ఇన్చార్జులు గాలి చెన్నారావు, లోత సింహాచలం బంటు లక్ష్మయ్య దేవత క్రాంతి నాలుగు పంచాయతీల నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com